క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఇబ్రహీంపట్నం రూరల్: మండల పరిధిలోని ఎల్మినేడు సబ్‌స్టేషన్ పరిధిలోని కప్పపహాడ్, ఎల్మినేడు ఇండస్ట్రియల్ ఏరియాలో మంగళవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన శంకర్‌నాయక్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.36 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితుడికి ఎమ్మెల్సీ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో హన్మానాయక్, యాదయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శతచండీ యాగానికి ఆహ్వానం



ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న సత్యం తదితరులు

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని బీఎన్‌రెడ్డి నగర్‌లోని సాగర్‌కాంప్లెక్స్‌లో నవీన్‌శర్మ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 19వరకు శతచండీ యాగం నిర్వహించ తలపెట్టారు. ఈ యాగానికి మండల పరిధిలోని శెట్టిపెల్లి గ్రామానికి చెందిన ఎగిరిశెట్టి సత్యం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నరేశ్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

మక్కువతో చదవండి

కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ చరణ్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న చరణ్ తదితరులు

యాచారం: విద్యార్థులు చదువుపై మక్కువ పెంచుకుని కష్టపడి చదవాలని కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ చరణ్ అన్నారు. మండల పరిధిలోని చింతుల్ల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఆయన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన ఉంటుందని.. విద్యార్థులు కొద్దిగా కష్టపడినా ఉత్తమ గ్రేడ్లను సాధించవచ్చని సూచించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుప్పాల శాంతికుమార్, ఫౌండేషన్ సభ్యులు మహేశ్, నవీన్‌రెడ్డి, నాగని కుమార్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్

తలకొండపల్లి: తరగతి గదిలోనే దేశ భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ తిర్మణి నిర్మలాశ్రీశైలం గౌడ్ అన్నారు. ఉపాధ్యాయుల సలహాలు, సూచనల మేరకు చదువుకుంటే భవిష్యత్ బంగారుమయంగా మారుతుందని ఎంపీపీ విద్యార్థులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని దేవుని పడకల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అతిథిగా హాజరై 105 మంది విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, హెచ్‌ఎం సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలపై కళాజాత

కడ్తాల్: టీఎస్ ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ కళాజాత బృందం సభ్యులు సోమవారం ప్రచారం చేపట్టారు. మండల కేంద్రంలో పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు రాయితీ బస్‌పాస్, దివ్యాంగుల బస్‌పాస్ సౌకర్యాలు, కార్గో పార్సిల్స్, కొరియర్ సేవలను వివరించారు. తిరుపతి తదితర పుణ్యక్షేత్రాలకు తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించే ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలపై పాటల రూపంలో వినిపించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఆర్టీసీ అధికారులు కృష్ణ, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

పండగలా 'కంటి వెలుగు'

వైద్య శిబిరాల్లో కంటి అద్దాలు, మందుల పంపిణీ



కడ్తాల్: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కడ్తాల్: కంటి సమస్యలతో బాధపడేవారు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గడ్డమీది తండా సర్పంచ్ పాండునాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గడ్డమీది తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కంటి సమస్యతో బాధపడుతున్న వారికి కళ్లజోళ్లతో పాటు, మందులను ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కిరణ్‌కుమార్, దేవి, కోఆర్డినేటర్ సుధీర్‌బాబు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ తండాలో 866 మందికి పరీక్షలు

ఆమనగల్లు: మండల పరిధిలోని మేడిగడ్డతండాలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఏడు రోజుల పాటు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. మేడిగడ్డతండాకు చెందిన 866 మందికి డాక్టర్లు పరీక్షిత్‌నరేందర్, మంజులాదేవి కంటి పరీక్షలు నిర్వహించారు. 115 మందికి రీడింగ్ అద్దాలు అందజేయగా 146 మందికి ఇతర కంటి అద్దాలు అందించారు. కంటివెలుగు ముగింపు సందర్భంగా మేడిగడ్డతాండా పంచాయితీ కార్యాలయం వద్ద డాక్టర్లు పరీక్షిత్‌నరేందర్, మంజులాదేవి, సిబ్బందిని సర్పంచ్ అంబర్‌సింగ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్, వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

లింగరావుపల్లి, వెల్జాల్ శిబిరాల్లో..

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లి కంటి వైద్య శిబిరం, వెల్జాల్ కంటి వైద్య శిబిరంలో సోమవారం కంటి వైద్యులు 287 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 18 సంవత్సరాలు పైబడిన వారి కందరికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు కల్పన, శ్వేతలు తెలిపారు. దృష్టి లోపాలున్నవారికి కళ్లద్దాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రామకృష్ణ, మల్లికార్జున్, మల్లయ్య, రామచంద్రయ్య, రవి కుమార్, మాధవి, స్వాతి, నాగమల్లీశ్వరి ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కలెక్టర్‌కు నివేదిక

తహసీల్దార్ సుచరిత



వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

యాచారం: బొక్కల కంపెనీ విషయంలో ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను సేకరించి త్వరలోనే కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని తహసీల్దార్ సుచరిత అన్నారు. సోమవారం ఆమె కొత్తపల్లి గ్రామంలోని బొక్కల కంపెనీని సందర్శించారు. కంపెనీ అనుమతులు, లైసెన్స్, యాజమాన్యం తయారు చేసిన నూనె, పొడిని పరిశీలించారు. అనంతరం దీక్షా శిబిరం వద్దకు చేరుకుని మాట్లాడారు. ఏ కంపెనీ అయినా ప్రజల ప్రాణాలకు ఇబ్బందులు తీసుకువస్తే సహించేది లేదన్నారు. అటువంటి కంపెనీల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. గ్రామస్తులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారని గుర్తించామన్నారు. త్వరలోనే కొత్తపల్లి, తక్కళ్లపల్లి, మాల్, తమ్మలోనిగూడ తదితర గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను సేకరించి కలెక్టర్‌కు నివేదిక పంపిస్తానన్నారు. ప్రజలు శాంతియుత మార్గంలో నిరసన తెలపాలని ఆమె సూచించారు.

ఘనంగా వేదాద్రి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ వేదాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు రెండో రోజు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కన్నుల పండువగా కొనసాగిన ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. స్వామిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు యాదగిరి నర్సింహయ్య శాస్త్రి, శ్రీనివాసమూర్తి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రవికుమార్, ఎంపీటీసీ సభ్యుడు అంబాజీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



సీతారాంపేట చేరుకున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పాదయాత్ర

ప్రగతి నివేదన పాదయాత్రలో ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రజలే దేవుళ్లు....వారి ఆశీస్సులు ఎల్లవేలలా తనకు ఉండాలని ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తనయుడు, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర సోమవారం మండల పరిధిలోని సీతారాంపేట గ్రామానికి చేరుకుంది. పార్టీ నాకయకులు ఆయన యాత్రకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్‌రెడ్డి గ్రామంలోని వృద్ధులను, మహిళలను, యువకులను కలుసుకుంటూ పాదయాత్రను కొనసాగించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. పలువురు వృద్ధులు తమకు పింఛన్ ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో స్థానిక ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రజల కష్టసుఖాలను తెలుసుకునేందుకే పాదయాత్రను చేపట్టినట్లు తెలిపారు. అర్హులందరికీ పింఛన్లు ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం పాదయాత్ర రాయపోల్ గ్రామం వరకు కొనసాగింది.

ప్రభుత్వాల తీరుతో పేదల బతుకులు దుర్భరం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజాగ్రహం తప్పదు
- పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



హాథ్ సే హాథ్ జోడో యాత్రలో శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో పేదల బతుకులు దుర్భరంగా మారాయని.. ఈ ప్రభుత్వాలు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సందేశాన్ని ప్రతీ గడపకు చేర్చాలనే ఉద్దేశంతో 'హాథ్ సే హాథ్' జోడో యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ యాత్ర సోమవారం మండల పరిధిలోని పల్లెచెలకతండాలో కొనసాగింది. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు నియంతృత్వ పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల పెంచి సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా నెరవేర్చలేదన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, దళితులకు 3 ఎకరాల భూమి, రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం హామీలు విస్మరించిందన్నారు. ధరణితో పేరుతో రైతులను దగా చేస్తోందన్నారు. విద్యుత్, బస్సు చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచి ప్రజలను దోచుకుంటోందని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాట నర్సింహ, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఎంపీటీసీ సభ్యుడు రాములుగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు హీరాసింగ్, రామకృష్ణ, శ్రీనునాయక్, వెంకటయ్య, రమేశ్‌నాయక్, బాల్‌దాస్, రాజు తదితరులు ఉన్నారు.

పరామర్శ

ఆమనగల్లు: మాడ్గుల మండలం చంద్రాయణపల్లి గ్రామం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నుచ్చుగుట్టతండాకు చెందిన బిక్యానాయక్‌ను సోమవారం పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. ఈ ప్రమాదంలో బిక్యానాయక్ భార్య శాంతి మృతిచెందగా బిక్యనాయక్ తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతున్నాడు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిక్యానాయక్, పార్టీ నాయకులు రామకృష్ణ, వెంకటేశ్, హీరాసింగ్, తులసీరాంనాయక్, కృష్ణనాయక్ తదితరులున్నారు.

మసీదు పక్కన చెత్త తొలగించండి



కమిషనర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మసీదు కమిటీ సభ్యులు

ఆమనగల్లు: పట్టణంలోని పోస్టాఫీసు ఎదురుగా ఉన్న హమద్ హిలాల్ మసీదు పక్కన ఉన్న చెత్త తొలగించాలని మసీదు కమిటీ అధ్యక్షుడు గౌస్ మొయినుద్దీన్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మైనార్టీ నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందించారు. మసీదు పక్కనే చెత్త బుట్టలు ఏర్పాటు చేయడంతో సమీపంలోని ఇళ్ల నుంచి చెత్త తీసుకువచ్చి వేస్తున్నారన్నారు. దీంతో మసీదు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని వివరించారు. వెంటనే మసీదు పక్కనున్న చెత్త తొలగించి ఇబ్బందులు లేకుండా చూడాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మసీదు కమిటీ అధ్యక్షుడు మాసూం, ఖాదర్‌ఖాద్రి, నాయకులు జలాల్, ఖుద్దూస్, జిలాని, జబ్బార్, నయీం తదితరులున్నారు.

పింఛన్ మంజూరుకు వినతి

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి గ్రామానికి చెందిన 70 ఏళ్ల దివ్యాంగ వృద్ధుడు తనకు పింఛన్ మంజూరు చేయాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఫ్లోరైడ్ సమస్యతో ఏళ్ల నుంచి కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. దీంతో ఆయన పలుమార్లు పింఛన్ మంజూరు చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నాడు. సదరం సర్టిఫికెట్‌లో 62 శాతం వికలత్వం ఉంది. గ్రామ ఎంపీటీసీ సభ్యుడు కొర్ర జ్యోతి నాయక్ విన్నవించగా సోమవారం సోమయ్యను ఎంపీటీసీ సభ్యురాలు మండల పరిషత్ కార్యాలయానికి తీసుకువచ్చి మండల పరిషత్ పర్యవేక్షకురాలు శైలజకు ఆటోల నుంచే వినతిపత్రం ఇచ్చారు. తాను ఎన్నో మార్లు వినతి పత్రాలు ఇచ్చానని ఇప్పటికైనా పింఛన్ మంజూరు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొర్ర అరవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ రూ.10వేలకు పెంచండి

ఎన్‌పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

ఇబ్రహీంపట్నం: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్‌పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. సోమవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సమావేశాన్ని ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల పింఛన్ రూ.10వేలకు పెంచాలని, స్థలం ఉన్న దివ్యాంగుల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. జీఓ 17తో ఆసరా పెన్షన్లు రద్దు చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి, కార్యదర్శి జె.రాజు, కోశాధికారి రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన పలువురు బాధిత కుటుంబాలను సోమవారం ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. బీసీ కాలనీ చెందిన లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3వేల సాయం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న యాదమ్మ, లక్ష్మమ్మకు రూ.3వేలు, రూ.4వేలు అందజేశారు. అనంతరం ఇటీవల ప్రమాదంలో గాయపడిన శివకు చికిత్స నిమిత్తం రూ.4వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధశరథం, లక్ష్మయ్య, మల్లయ్య, భానుకిరణ్, రవి, రాజేశ్, ఇమ్రాన్‌బాబా, శ్రీకాంత్, మహేశ్, నరేశ్, శ్రీను తదితరులున్నారు.

సాయం అందజేసిన సర్పంచ్

మండల కేంద్రానికి చెందిన కాసుల లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి సోమవారం స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు, లాయక్‌అలీ, భిక్షపతి, వెంకటేశ్, అంజయ్య, మహేశ్, అశోక్ తదితరులున్నారు.

పేద విద్యార్థినికి చేయూత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన శైలజ వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నది. ఆమె ఫీజులు చెల్లించేందుకు ఇబ్బంది పడుతోందని తెలుసుకున్న స్థానిక నాయకుడు అశోక్‌గౌడ్ ఉప్పల ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను ఆశ్రయించాడు. దీంతో స్పందించిన జెడ్పీటీసీ శైలజ బీఎస్సీ చదువుకయ్యే ఖర్చు మెత్తాన్ని ట్రస్టు ద్వారా అందజేస్తానని హామీ ఇచ్చారు. సోమవారం ఈ మేరకు ట్రస్టు సభ్యులు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం కల్వకుర్తి తాలుకా కన్వీనర్ అశోక్‌గౌడ్, రైతుసంఘం నాయకుడు రేణురెడ్డి, మహేష్, రాజేందర్, రాజశేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

మాడ్గుల: విద్యుదాఘాతంతో గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. సర్పంచ్ వెంకటేశ్వర్లుగౌడ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ఐలబోయిన వెంకటయ్య తన పొలంలో గడ్డివాము నిల్వ ఉంచాడు. కాగా సమీపంలోని విద్యుత్ వైర్లు ఒకదానికి ఒకటి తగిలి నిప్పులు చెలరేగి గడ్డివాముపై పడ్డాయి. దీంతో గడ్డివాముకు మంటలు అంటుకుని దగ్ధమైంది. సుమారు రూ.30వేల నష్టం వాటిల్లిందని.. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కోరారు.

రైతు సంక్షేమానికే ప్రభుత్వం ప్రాధాన్యత

ఆమనగల్లు: వ్యవసాయరంగం అభివృద్ధికి, రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ సర్కార్ అధిక ప్రాధాన్యత ఇస్తోందని బీఆర్ఎస్ రైతువిభాగం జిల్లా నాయకుడు రూపం వెంకట్‌రెడ్డి అన్నారు. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.6,385 కోట్లు కేటాయించిందని ఆయన చెప్పారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూపం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు పర్వతాలు, నర్సింహ, రమేశ్, విజయ్ ఉన్నారు.

శిక్షణ తరగతులకు ఉప సర్పంచ్ అనిల్

తలకొండల్లి: నగరంలోని రాజేంద్రనగర్ ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల సొంత ఆదాయం-వనరుల సమకూర్పు అంశంపై ఐదు రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 13 నుంచి 17వరకు కొనసాగుతున్న ఈ తరగతులకు మండల కేంద్రానికి చెందిన ఉపసర్పంచ్ అనిల్ ఎంపికయ్యారు.

రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం: కౌన్సిలర్ జ్యోతి

ఆమనగల్లు: పేదల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ జ్యోతి కోరారు. పట్టణంలోని 5వ వార్డులో సోమవారం ఆయుష్మాన్‌భారత్ పథకంలో పేరు నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. ఆయుష్మాన్‌భారత్ పథకంలో చేరిన వారికి ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆసుపత్రులలో రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం పొందవచ్చని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మణ్, బీజేపీ కల్వకుర్తి కో కన్వీనర్ నర్సింహ, ఆయుష్మాన్ భారత్ పథకం సభ్యులు వెంకటేశ్, వంశీ, మహేశ్, దీపిక, లక్ష్మి ఉన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయండి

పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎల్మినేడు అనుబంధ గ్రామం మెటిల్లాకు చెందిన 30 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పార్టీ కండువాలు కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లనే పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని మరిచిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జడల రవీందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేశ్, పార్టీలో చేరిన వారిలో నాగేష్, సాయిరాం, శ్రీను, శివ, చింటూ, ప్రశాంత్, లింగస్వామి, నవీన్, ప్రశాంత్, సత్తయ్య, ఆనంద్, నరసింహ, రాములు, మహేందర్, దానయ్య, శంకర్, లోకేశ్, చిలుకయ్య, దేవేందర్, మధు, శ్రీకాంత్, విష్ణు, రమేశ్ తదితరులున్నారు .

'భగీరథ'తో తాగునీటి ఎద్దడి

సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి

మంచాల: మిషన్ భగీరథ అధికారులు సమస్యల పరిష్కరించక పోవడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడుతోందని సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆరుట్లలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా చేయడం లేదని దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని సర్పంచ్‌కు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తాగునీటి సమస్యపై ఫిర్యాదు చేసినా మిషన్ భగీరథ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ప్రజలు తిరుగుబాటు చేయకముందే సరిపడా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాండాల జంగయ్యగౌడ్, ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, వార్డు సభ్యులు శివకుమార్, వెంకటేశ్, స్వప్న, మల్లేశ్, యాదయ్యగౌడ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించాలి



పోషణ్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ తదితరులు

తలకొండపల్లి: మాతా,శిశు మరణాలు తగ్గించి, తల్లుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ తిర్మణి నిర్మలాశ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీడీపీఓ సక్కుబాయి ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్-కన్వర్జెన్స్ యాక్షన్ ప్లాన్ (సీఏపీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ హాజరై మాట్లాడారు. 0–6 సంవత్సరాల పిల్లలు, కౌమార బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లుల పోషకాహార స్థితిని మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎత్తుకు తగినవిధంగా బరువు లేని పిల్లలు, రెండున్నర కిలోలకన్నా తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు, రక్తహీనతతో బాధపడుతున్న పిల్లల వివరాలను ఐసీడీఎస్ అధికారులకు చెప్పాలన్నారు. పోషణ్ అభియాన్‌లో తలకొండపల్లి మండలాన్ని ఉత్తమమైందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సక్కుబాయి, మెడికల్ ఆఫీసర్‌లు సైదమ్మ, కల్పన, మెడికల్ సిబ్బంది రామచంద్రయ్య, ఎంపీటీసీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో సోమవారం శివస్వాముల మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాట నర్సింహ ఈ పడిపూజ నిర్వహించారు. అనంతరం మాలధారణ స్వాములు ఇరుముడి ధరించి శ్రీశైల క్షేత్రదర్శనానికి కాలినడకన బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామం శివ నామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు ప్రభాకర్, కృష్ణయ్య, మహేశ్, జనీల్, రాజు, నారాయణ, గోపాల్, శ్రీకాంత్, వినయ్, మురళి, శివ పాల్గొన్నారు.